కె. బి. కృష్ణ

# జ్ఞాననేత్రాలు

పత్రికారంగంలో నాకు ప్రత్యేక విలేఖరిగా మంచి పేరువచ్చింది అనతికాలంలోనే.

కారణం, నేను సమాజంలో వెనుకబడిన వ్యక్తుల జీవితాలు, సంఘంలో ఉన్నతాశయాలు ప్రతిబింబించేట్లు చక్కని శీర్షికలతో పత్రికల్లో వ్యాసాలు వ్రాయటమే. పోయిన వారంనుండి ప్రారంభించడిన క్రొత్త శీర్షికకు ఒక చక్కని జీవిత సమస్యతో ముడిపడిఉన్న వ్యక్తి జీవితాన్ని గురించి వ్రాయాలను కుంటుండగా తిరుపతి ప్రయాణం చేయవలసి వచ్చింది ఒక పత్రికా సంపాదకుని కుమారుని వివాహ సందర్భంలో. రాత్రి వివాహం. నేను ఉదయమే దిగువ తిరుపతిలో దిగి క్లోక్ రూమ్‌లో సూట్‌కేసుపడేసి ఒక సంచిలో ఆ రోజుకు కావాల్సిన బట్టలు వగైరాలు తీసుకుని బయలుదేరాను. ఈలోగా నడిచి వెళ్ళే యాత్రికుల బృందాలు భజనలు చేసుకుంటూ నా ముందునుండి వెళ్ళేయి. నాకు కూడా ఎందుకో వాళ్ళను అనుసరించాలనిపించింది. అందుకని వాళ్ళ వెంబడి నడవసాగేను. ఈ నిర్ణయం ఒక విధంగా నా వ్యాసపరంపరకు ఉపయోగపడుతుందేమోనన్న స్వార్థంకూడా ఉంది.

వాళ్ళతోపాటుగా మొదటి కొండకు చేరుకున్నాను. తలవంచుకుని నడుస్తుంటే ఒక్కో మెట్టుమీద కీర్తిశేషులైన వ్యక్తుల పేర్లు చెక్కినవి కనపడ్డాయి. అలా పేర్లు చెక్కించటంవల్ల, చనిపోయినవారికి, వారి పేర్లు యాత్రికుల పాదాల త్రొక్కిడివల్ల పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయట. ఏమిటో పిచ్చినమ్మకాలు : నా ఆలోచనలకు అంతరాయం కలిగింది, దారికి ఎడమవైపుగా ఒక చిన్న కుటీరం నన్ను ఆకర్షించింది. నా కాళ్ళు అప్రయత్నంగా అటువైపు నడిచాయి.

పూర్తిగా వెదురు గెడలతో నిర్మించబడింది ఆ కుటీరం. చుట్టూ రకరకాల పూల మొక్కలతో, చిన్న తోటలాఉంది. ఎటుచూసినా పూజనీయుల, గౌరవనీయుల చిత్రపటాలు, బుద్ధుడు, కృష్ణభగవానుడు వివేకానందుడు, రమణమహర్షి. ఎదురుగా కాషాయవస్త్రాలు ధరించిన ఒకవ్యక్తి కనులుమూసుకుని జపమాల తిప్పుకుంటున్నాడు. నాకు ఆ వ్యక్తినిచూస్తే ఒక అవ్యక్తమైన గౌరవభావం కలిగింది. లోనికివెళ్ళి ఆయనకు ప్రక్కనే ఉన్నటువంటి చాప మీద కూర్చున్నాను. కొంచెంసేపటికి నా అలికిడి విని జపమాలను ఆపుచేసి " బాబు ఎవరు మీరు " అన్నాడా వ్యక్తి.

" నేను తిరుపతి సందర్శించడానికి వచ్చాను. కాలినడకన వెళ్ళి భగవంతుని దర్శించాలని అనిపించింది. వెళుతుంటే మీ మందిరం కనపడింది, అనాలోచితంగా మీ మందిరానికి వచ్చాను. మీకు జపభంగం కలిగిస్తే క్షంతవ్యుణ్ణి " అన్నాను.

"చేయని తప్పుకు క్షమార్పణలు వద్దు. నాయనా నా జపానికి భంగం కలుగదు. నా ఈ జన్మ అంతరించేవరకు జరుగవలసిందే ఈ జపం. ఎందుకంటే, ఈ ప్రపంచంలో చూడదగనివి చూడదగినవి చేయదగినవి చేయదగనివి అన్నీ నా జన్మలో జరిగినవి. నా శరీరం మాత్రంమిగిలిఉంది. నా ఈ శరీరం అంతా పాపపంకిలమైంది. నేను ప్రస్తుతం నా ఆత్మ ప్రక్షాళనచేసుకుంటున్నాను. ఆత్మప్రక్షాళన అనేది అయితే, అప్పటివరకు ఈ శరీరం మిగిలిఉంటే శరీరాన్నికూడా క్షాళన చేసుకుంటాను తగు రీతిలో. లేదా మట్టిలో కలిసేక జరుగవలసిందే మిగిలినది.

నాయనా నీ వయస్సు చూస్తే నిండా ముప్ఫై సంవత్సరాలు ఉన్నట్లు లేదు నీ దైవభక్తికి నా అభినందనలు. నా మాటలు విసుగు కలిగిస్తున్నాయా నాయనా ! " అన్నారాయన.

నేను వచ్చినప్పటినుండి ఆయనను గమనిస్తున్నాను. ఆయన కనులు తెరువలేదు మరి నావయస్సు గురించి ఎలా చెప్పగలిగేరు ? " మీరు ఎన్ని రోజులుగా ఇలా కనులు మూసుకుని జపంచేస్తున్నారో నేను తెలుసుకోవచ్చా ? " అన్నాను.

"బాబూ నేను ఈ జన్మ అంతా కనులు మూసుకునే ఉండాలి. కనులు తెరిస్తే ఈ ప్రపంచం అతి సుందరంగా నన్ను కవ్విస్తూ నా జీవితాన్ని కాలుస్తూ నా జీవితంలో హాలహలం కురిపిస్తుంది. అది ఒకగాథ బాబూ. మీలాంటి వ్యక్తులు ముఖ్యంగా యవ్వనోద్రేకంలో పరుగులు పెడుతున్న యువత వినవలసినగాధ నా జీవితకథ. ఈనాటి

యువతకు ఒక నిఘంటువు నా జీవితం  తమకు తెలియని సమస్యలకు అర్థాలువెతుక్కోవచ్చు పరిష్కార మార్గాలు తెలుస్తాయి. నాయనా మిమ్మల్ని ఇలా సంబోధిస్తున్నందుకు అన్యథాభావించవద్దు. నాకు రెండు పదులు నిండకుండానే జ్ఞానోదయమైంది. ఈ మాయా ప్రపంచంలో బాధలకు గాధలకు కక్షలకు, కావేషాలకు కారణం ఏమిటో అన్వేషించాను. అన్వేషణ ఫలించింది. పరిష్కారం ఎట్టకేలకు కనుక్కున్నాను దానిని ఆచరించాను. అంతే నా మనస్సు ఇప్పుడు ప్రశాంతంగాఉంది. అది ఒక జీవిత పోరాటం ఆ పోరాటంలో నేను విజేతను. అవి చాలా గడ్డురోజులు నా జీవితంలో. ఒక విధంగా చెప్పాలంటే మంచి రోజులకు సమయం ఆసన్నమైంది" ఆయన తన స్మృతిపథంలోనికి పయనిస్తున్నారు.

చుట్టూ పచ్చని చెట్లు. చల్లని గాలి వీస్తుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది

" నాకు అప్పుడు వయస్సు ఇరవైలోపు. నిండు యవ్వనం, పండు యవ్వనం. ఉరకలు వేస్తున్న వయసు, సొగసులతో పోటీ పడాలని ఉవ్విళ్ళూరుతూండేది ఎప్పుడూ. దాన్ని అదుపులో పెట్టలేక పోయేవాణ్ణి ఎప్పుడూ.

చిన్న వయసులోనే చదువు సంధ్యలకు స్వస్తిచెప్పి ఉద్యోగాన్వేషణ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది నా జీవితంలో. ఆంధ్రదేశంలో ఒక ముఖ్యపట్టణంలో ఒక చిన్న ఉద్యోగంతో నా జీవితం ప్రారంభమైంది ఆ పట్టణంలో సాయంసమయం అయిందంటే కొన్ని సెంటర్లలో జన సమూహం అధికంగాఉండేది. ఎవరు ఎక్కడికి ఎందుకు వెళ్తున్నారు?

ఎందుకంత తొందర ? ఇవేమీ జనానికి అక్కర లేదు ఒకటే పరుగులు. యవ్వనం నా జీవితంలో ప్రవేశించింది అనటంకంటే నా జీవితమే యవ్వనంలో ప్రవేశించింది అనటం సబబు. ఎందుకంటే నాకు సౌందర్యారాధన అంటే అమితమైన ఆప్యాయత. ముఖ్యంగా అందంగా నందనవనంలో గులాబీల్లా మెరిసిపోయే యువతులుంటే నేను గంటలతరబడి చూస్తూండేవాణ్ణి, మంచి విగ్రహపుష్టి, పొడుగు, అందం ఉన్న స్త్రీ కనబడితే నాకు ఆరోజు కనుల పండుగే. అసలు అన్న పానీయాలు ముట్టుకోలేక పోయేవాణ్ణి. అటువంటి స్త్రీలపొందు కావాలని శరీరం పరితపించిపోయేది.

పదహారు సంవత్సరాల పడతి కనుపిస్తే ఆమెను అనుభవించాలని ఉండేది. ముప్పదుల లలన కనుపిస్తే తనివితీరా కౌగిలించుకోవాలని అనిపించేది. మధ్యవయస్కులైన స్త్రీలుకూడా నాదృష్టినుండి దూరం కాలేదు

నేను ఎప్పుడైనా ఒక అతి సుందరమైన లావణ్యవతిని చూసినప్పుడు, యవ్వనోద్రేకి నైనప్పుడు భగవంతుడు కనుపిస్తే ఒక వరం అడగాలను కునేవాణ్ణి. వెలుగుతున్న లైటును మనం అవసరం లేనప్పుడు ఎలా స్విచ్చితో ఆర్పివేస్తామో అదే రీతిలో పురుషుడు యవ్వనోద్రేకి అయినప్పుడు ఆ దాడిని తట్టుకోడానికి శరీరంలో అటువంటి యాంత్రిక ఏర్పాటు చేయమని. ఎందుకంటే అనవసరమైనప్పుడు దాన్ని అదుపులో పెట్టుకోవచ్చుకదా.

నిండు యవ్వనంలో ఉన్న స్త్రీ మంచి దుస్తులు వేసుకుని. వెళ్ళుతుంటే నాకు ఎక్స్‌రే కళ్ళు ఉంటే బాగుండుననిపించేది. ప్రతి స్త్రీని ఆమె సంపూర్ణ స్వరూపం చూడాలనిపించేది. వయసులో నున్న భార్యాభర్తలు

వెళ్ళుతుంటే, భర్తస్థానంలో నన్ను ఊహించుకుని "అబ్బ ఆమెకు నేను భర్తను కాకపోయానే" అనేది నా మనస్సు.

సాయంకాలం సెంటరుకు వెళ్ళడం, రాత్రి పది గంటలవరకు సౌందర్యారాధన, అందమైన స్త్రీలు కనపడితే వాళ్ళు ఎంతదూరం వెళ్తే అంతదూరం వారిని అనుసరించేవాణ్ణి, అందాన్ని తనివితీరా చూడాలని. అయితే నాలో గొప్ప గుణం ఏమిటంటే ఎవరినీ ముట్టుకోవటంగాని దుర్భాష లాడటంగాని, చేయలేదు. అందువల్ల నాకు సమస్యలు ఉత్పన్నం కాలేదు.

ఒక గులాబి మొక్కకు అందమైన గులాబి, తుళ్ళుతూ, గాలికి ఊగుతూ, ప్రకృతి వెలుగులో మెరిసిపోతూ మనల్ని కవ్విస్తూ ఉంటుంది. స్త్రీలు ఎవరూ చూడకపోతే దాన్ని కోసుకుని తలలో పెట్టుకోవాలని ఉవ్విళ్ళూరుతుంటారు. కాని దాన్ని మొక్కతో వేరుచేసి తలలో పెట్టుకున్న కొద్ది సమయంలోనే వాడి, రేకలు ఊడిపోయి తొడిమ మాత్రం మిగిలిపోతుంది: తనను కవ్వించే గులాబిని మొక్కనుంచి వేరుచేసి తలలో శాశ్వతంగా అలంకరించుకోవాలనుకుని తపనపడే స్త్రీ ఎవరనుకున్నారు? పురుషుడు. ఆ గులాబి—స్త్రీ

అందమైన యువతిని, ఎంతమందినో చూసిన తరువాత యువకుడు ఎన్నుకుంటాడు, తన జీవిత భాగస్వామిగా. ఆమె అందం అవయవ సౌందర్యం శాశ్వతంగా తనలో ఇముడ్చుకోవాలని కలలు కంటాడు. ఆ యువకుడు. కాని కొన్ని సంవత్సరాలతరువాత ఏం జరుగుతుంది?

ఆ గులాబి వాడిపోయి, నిగనిగలు చెదిరిపోయి, రేకలు ఊడిపోయి తొడిమ మాత్రం మిగిలి పోతుంది. అది చూసిన యువకుడు అయ్యో ఈమేనా నేను ఎన్నుకున్న సుందరి అని బాధ పడతాడు. మళ్ళీ మొదలు సౌందర్యారాధనం. ఈ యువకుడి చూపులు గతి తప్పుతుంటాయి. పర స్త్రీల పొందుకోసం ప్రాకులాడుతుంటాడు. ఇదంతా భ్రమ. భగవంతుడు స్త్రీలను సృష్టించి ఎలుకల బోనులో ఎఱలాగ మన మీదకు పంపించాడు. ఆ ఎఱను రుచిచూస్తే, తింటే రుచిగా ఉంటుంది అనుకుని, కోరికి, నలిగి పోయే ఎలుకల వంతు అవుతుంది మనపని.

నా శరీరం సౌందర్యారాధనంతో తృప్తి పడటంలేదు, ఎట్టి పరిస్థితులలోనైనా స్త్రీ పొందుకావాలని తపన చెందుతూంది.

ఆ రోజు నా జీవితంలో కాళరాత్రి. శనిదేవత విలయతాండవం చేసిన రోజు, ఇంకొక విధంగా చెప్పాలంటే నాకు జీవితంలో శాశ్వతంగా శాంతి దొరికిన రోజు.

ఆ రోజు యధావిధిగా సెంటరులో నుంచుని ఉన్నాను. రకరకాల వేషధారణలో తమకు బాగుంటాయా లేదా అనే విచక్షణ లేకుండా వస్త్రధారణతో యువతీ యువకులు తిరుగుతున్నారు. నేను కూల్ డ్రింకు త్రాగి సిగరెట్ కాలుస్తున్నాను.

నా ముందుగా ఒక పుష్పక విమానంలాంటి కారు ఆగింది. అందులో నుండి అతిఖరీదైన, అధునాతనమైన దుస్తులలో వున్న ఇద్దరు వ్యక్తులు, ఒక స్త్రీ దిగేరు. ఆమె స్త్రీగాదు ఒక మెరుపు తీగె. ఎత్తు సుమారు ఆరు

అడుగులు ఉంటుంది. ముట్టుకుంటే మచ్చ పడేటట్లు ఉండే రంగు. గులాబీ రంగుచీర తెల్లని జాకెట్, పిఱుదుల దాకా పాములాంటి జడ, తెల్లని జాకెట్‌లో నిండిన అందాలు చీరకు అతికినట్లు ఉన్న శరీరపు ఒంపుసొంపులు విశాలమైన మైదానాన్ని గుర్తు చేసే జఘనభాగం, విశాలమైనఛాతీ, మెడలో తెల్లని రాళ్ళనెక్లెస్, శరీరపు కాంతితో పోటీ పడుతూంది. చీరకు జాకెట్టుకూ మధ్యన లోతుగా అందంగా ఉన్న బొడ్డు. నడుముకు రెండు వైపులా నున్నని ముడుతలు. బాపుబొమ్మలా చక్రాల్లాంటి కళ్ళు. గాజుల్లాగా చెవులకు రింగులు. ఆమె కనులు త్రిప్పుతూ మాట్లాడుతుంటే శరీరంలో ప్రతి అణువణువూ కదులుతూంది.

నా హృదయం స్పందించింది. గుండె వేగం పుంజుకుంది. ఆమెతో కారు నుండి దిగిన ఇద్దరు వ్యక్తులు దగ్గరలో ఉన్న కాఫీ హోటల్లోకి ప్రవేశించారు. ఆమె కొంచెం సేపు కారు దగ్గరనే నుంచుని తరువాత కారులో కూర్చుండి పోయి నాకు కను మరుగైంది. కారుకు ముదురు నీలం రంగు అద్దాలుండటంతో కారులోని వారికి బయట వాళ్ళు కనపడరు. బయట వాళ్ళకు లోని వాళ్ళు కనపడరు. నాకు ఆమెను చూడాలని తాకాలని తనివి తీరా అనుభవించాలని ఏదోకోరిక, తపన. అది సాధ్యమేనా !

అటూ ఇటూ చూశాను. ఎవరిగొడవలో వాళ్ళున్నారు. నాలోని పశువు మేల్కొన్నాడు. కారు తలుపు తీసి వేగంగా లోనికి ప్రవేశించాను. ఆమె అవాక్కయి చూస్తోంది ఆమెను వెనుకసీటుపై పడవేసి ఆమె శరీరం అణువణువూ చూశాను. ఆమెను ముద్దులతో ముంచెత్తేశాను. నాలో వేడి

చల్లారింది. ఆమెను చూడ వలసినట్లుగా చూశాను. నాలోని వేడి చల్లారింది. ఆమె కనుల్లో అగ్నిజ్వాలలు ; నేను ఆహుతి అయిపోతానను కున్నాను.

ఈ లోగా వచ్చారు ఆ ఇద్దరు వ్యక్తులు. నేను వెంటనే కారుదిగి పరుగులెత్తసాగేను.

" రాస్కెల్ పట్టుకోండి "

" పోలీస్ అరెస్ట్ హిమ్. ఫాలో హిమ్ " అని అరుస్తున్నారు. ఇవేమీ నాకు వినపడలేదు నేను సందులు గొందులు తిరుగుకుంటూ నా గదికి చేరుకున్నాను. నేను ఈపరిస్థితుల్లో చిక్కుకోడాన్కి కారణం స్త్రీ అందం. భగవంతుడు సృష్టి కోసం నిర్మించిన ఈ అందమైన హర్మ్యాలు నాకు సొంతం కావాలను కోవడం పొరపాటు. అసలు ఈ అంద మైన సృష్టిని చూడకుండా ఉంటే అసలు సమస్య ఉండదు కదా. అవును ఈ కళ్ళే అన్నిటికీ మూలం. ఈ కళ్ళు మూలంగానే కదా సౌందర్యం చూస్తున్నాను ఉద్రేకం కలుగుతూంది. ఈ సౌందర్యారాధనకు స్వస్తి చెప్పాలి. ఎలాగూ పోలీసులు వచ్చి నన్ను అరెస్టు చేస్తారు. అల్లరిపాలు అవుతాను. అంతే. నా రెండు కళ్ళను పదునైన వస్తువుతో పొడుచు కున్నాను.

" అమ్మా " అని అరిచాను. స్వర్గధామాల్లో ఉన్న మా అమ్మకు ఆ కేక వినిపించి వుంటుంది. రెండు కనుల నుండి ధారాపాతంగా రక్తం కారుతూంది.

బూట్లు చప్పుడు. కారువచ్చింది. జీపువచ్చింది. వాటిలోని వ్యక్తులు దిగిన శబ్దం.

తలుపులు కొడుతున్నారు. నేను వెళ్ళి తలుపు తీసే శక్తి లేక కొద్దిక్షణాల్లో స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నాను.

తలుపులు పగుల గొట్టేరు.

"అయ్యో ఎంత పని జరిగింది. కళ్ళు పొడిచేసుకున్నాడు. అయినా సరే అరెస్టు హిమ్"

"ఇన్‌స్పెక్టర్ డోన్ట్ బి ఇన్ హేస్టీ. డోన్ట్ అరెస్ట్ హిమ్" చల్లని చేతులు నా కనులు తుడుస్తున్నాయి. ఆ స్పర్శ నాకు తెలుసు. ఎందుకంటే ఆ స్పర్శలోనే తృప్తి పొందిన వ్యక్తిని కాబట్టి.

"డార్లింగ్. వాటీస్ దిస్. డోన్ట్ బి సింపథిటిక్. ఇలాంటి రాస్కెల్‌ను ముక్కల్లా నరికి కాకులకు గెద్దలకు వెయ్యాలి." అంటున్నాడు ఆమెకు భర్త అయి ఉండాలి.

"ఇన్ స్పెక్టర్ యూ కెన్ గో. మీకు శ్రమ ఇచ్చాను. నేను ఇతని సంగతి చూసుకుంటాను. మీరు అన్యథా భావించ వద్దు." అంటున్నది ఆమె. తరువాత మాటలు నాకు వినిపించలేదు. స్పృహ కోల్పోయాను.

ఆ—

ఆ రోజు రాత్రి నాకు స్పృహ వచ్చింది.

" నేను ఎక్కడున్నాను ? " అరిచాను.

" హాస్పిటల్లో " నాకు తెలిసిన స్పర్శ నన్ను సవరిస్తూంది.

" పాపాత్ముణ్ణి నన్ను చంపండి, నరకండి, అమ్మా మీ ఆదరణకు అర్హుణ్ణికాదు " ఉద్రేకం వచ్చేసింది నాకు.

" డోన్ట్ బి సిల్లీ. మిమ్మల్ని ఏమీ చెయ్యను. మీరు అనవసరంగా ఉద్రేకపడకండి. మీరు చేసిన తప్పుకు ఇంత దారుణమైన శిక్ష విధించుకోవటం దురదృష్టం " అనునయిస్తూంది ఆమె.

తనను కారులో మానభంగంచేసినా సరే నన్ను మానవతా దృష్టితో ఆదరించే ఇటువంటి వ్యక్తులు ఈ ఆధునిక సమాజంలో ఉన్నారా అందులోనూ ధనవంతులల్లో ఉన్నారా ? ఇది సమాధానం ఇవ్వలేని ప్రశ్న.

" అమ్మా నన్ను క్షమించండి. నన్ను మీరు చిత్రవధచేసినా సంతోషిస్తాను అంతేగాని నన్ను అనునయించకండి. ఆదరించకండి. ఆదరిస్తే మళ్ళీ ఇంకోసారి చనిపోతాను. నేను ప్రస్తుతం జీవచ్ఛవాన్ని. నన్ను క్షమించండి. " ఆమె చేతులు పట్టుకుని లేచి ఆమె కాళ్ళకోసం వంగి ఆమె కాళ్ళుపట్టుకుని కూలబడిపోయాను. నా కనుల నీరుతో ఆమె పాదాలు అభిషేకించాను. ఆమె చల్లనిపాదాల స్పర్శ నా శరీరాన్ని పునీతం చేసింది.

కథా నిలయం
1042
శ్రీకాకుళం

"అమ్మా మీరు ?"

ఆమె ఎవరో చెప్పింది. చెప్పి "మీరు నన్ను ఆ విధంగా కారులో అనుభవించినందుకు నేను మిమ్మల్ని చిత్రవధ చేయించాలనుకున్నాను. ఎలాగైనాసరే మిమ్మల్ని పట్టుకోమని, నేనుకూడా పోలీస్ జీపులతో వెంటబడి తిరిగి మిమ్మల్ని పట్టుకున్నాను. కాని ఆశ్చర్యం ప్రభుత్వం చేతిలో శిక్ష అనుభవించకుండా మీకై మీరు ఘోరాతిఘోరమైన శిక్ష విధించుకున్నారు. మిమ్మల్ని ఆ స్థితిలో చూసి, మీ రక్తం ప్రవహించే కళ్ళను చూసి నా హృదయం ద్రవించింది. మీకు సపర్యలు చేస్తుంటే స్పృహ కోల్పోయారు. తరువాత హాస్పటల్‌లో చేర్చాను. మీ తదుపరి జీవితపు బాధ్యత నేను చూసుకుంటాను. మీరు ఈ పరిస్థితికి రావడానిక నేను బాధ్యురాలిని. నా ఈ పాపానికి నిష్కృతిలేదు. మీకు ఎక్కడ ఉండాలని ఉందో, ఏ విధంగా ఉండాలని ఉందో చెప్పండి. ఒక ఆయాను నియమించి మీకు ఏర్పాట్లుచేస్తాను. అంతేకాని చనిపోవాలని మాత్రం నిర్ణయం చేసుకోవద్దు. మీకు జీవితం నేర్పిన పాఠాలు ఇతరులకు తెలియ చెయ్యండి" అంటూ ఆమె నా చేతులు పట్టుకుని రోదించసాగింది.

"అమ్మా మీరు ఇంక ఏమీ చెప్పవద్దు. దయచేసి నన్ను తిట్టండి. అంతేకాని నన్ను ఏంకావాలి అని అడగవద్దు. నేను శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో నా శేషజీవితాన్ని గడిపి మరణిస్తాను. నాకు ఆ వరం ప్రసాదించండి. అమ్మా మీకు జన్మాంతం ఋణపడి ఉంటాను" అన్నాను

తరువాత ఆమె నాకు ఈ ఏర్పాట్లుచేశారు. ఈ కుటీరం, ఈ ఆయా, ఈ పరిసరాలు ఈ సౌకర్యాలు, ఆ సుధాకలశ హృదయం చలవే. ప్రతి నెలావచ్చి నన్ను పలుకరించి, ఏర్పాట్లు పర్యవేక్షించి వెళ్తారు.

నా నేత్రాలు శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాయి. ఇప్పుడు మీకు అర్థంఅయి ఉంటుంది నేను కనులు మూసుకున్నానా లేదా కనులునన్ను మూసివేశాయా అన్నది.

బాబూ ! నేను చెప్పే ఈ మాటలు ఈ ఆధునిక యుగంలో యువతరానికి మార్గదర్శకాలు.

గీతలో భగవానుడు ఏం చెప్పాడు ?

" ఎల్లప్పుడూ విషయ వాంఛల గురించి ఆలోచించు మానవునకు ఆ విషయ భోగేచ్ఛ పుట్టును. ఆ ఇచ్ఛకు ఒకానొక కారణము వలన ప్రతిబంధకము కలిగిన క్రోధము వచ్చును. క్రోధము వలన కార్యాకార్య వివేకము నశించును. అవివేకం వలన పూర్వానుభవ స్మృతి కలుగకుండును. అట్టి స్మృతి లేనినాడు యుక్తాయుక్త సద్విచార బుద్ధి లోపము వలన పురుషార్ధ సాధన కయోగ్యుడై పురుషుడు నశించును. ధర్మార్ధ కామ మోక్షములు సాధించలేని పురుషుని జీవితము వ్యర్థము. "

" ఎవడు కర్మేంద్రియములగు వాక్పాణి పాదపాయూపస్థలను నిగ్రహించి ఇంద్రియ విషయములగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను మనసా స్మరించుచుండునో అట్టి మూఢాంతఃకరణుడు మృష్టాచారుడు ( కపటి ) అని చెప్పబడును."

బాబూ—పుణ్యం కోసం భగవంతుని దర్శించడానికి దేవాలయాలకు వెళ్తాము. దేవాలయాలకు స్త్రీలు ఎటువంటి అలంకరణలు చేసుకుని వస్తున్నారు ? దేవాలయాలకు వెళ్ళేటప్పుడు యువతుల అలంకరణ విషయాలలో కొన్ని నియమ నిబంధనలు ఉండాలంటాను నేను.

నాయనా ఈ ప్రపంచం, జీవితం, సుఖాలు, రాగద్వేషాలు, భార్యాబిడ్డలు, విశేష ధన ధాన్యాలు అన్నీ అశాశ్వతం. ఏవీ మన కూడా రావని తెలుసు. కాని ఎంతమంది ఇలా ఆలోచిస్తున్నారు? చెప్పండి?

ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులను గమనించండి. మీరు రోజూ వార్తాపత్రికల్లో కనపడుతూనే ఉంటాయి వార్తలు, బాలికలను మానభంగం చేసినట్లు. యుక్త వయస్సు రాని బాలికలను మానభంగం చేయుడానికి కారణం ఏమిటి? అది ఒక కారుచిచ్చు. సామ్రాజ్యాలు సైతం కూలినయ్ ఈ కామానలంతో.

దీనికి ఒక్కటే మార్గం.

"జ్ఞాన నేత్రమును విప్పిచూసి శరీరము నీటిబుడగ వలె క్షణభంగురమైనదని, మృగతృష్ణ వంటిదని తెలుసుకున్నవాడు మారుని ప్రమోహములలో కూలక అమృత పథమును చేరుచున్నాడు.

ఇది నగ్న సత్యం బాబూ! దీనిని ఎవరూ అంగీకరించరు. మన నేత్రాలు మనకు శత్రువులు. మన నేత్రాలు మూసివేసుకుని, మనలోని జ్ఞాననేత్రాలలో ఈ ప్రపంచాన్ని చూస్తే సుందర స్వప్నం. అంతా ఆనందం". ఆయన కనులు నాకు తేజోమయంగా కనుపించాయి. ఆయన ముఖారవిందం దేదీప్యమానంగా వెలిగిపోతూంది. ఏం మాట్లాడాలో నాకు నోరురాలేదు. ఆయనను తదేకంగా చూస్తూ ఉండి పోయాను.

ఆయన దగ్గిరనుండి శెలవు తీసుకున్నాను "జ్ఞాననేత్రాల"ను నా పాఠకులకు అమూల్యమైన కానుకగా ఇవ్వాలని.

జనసుధ 10/80